అండర్‌పాస్ ఇలా.. రాకపోకలు ఎలా?



అండర్‌పాస్ పైకప్పు మూసివేయని దృశ్యం



అండర్‌పాస్‌లోకి చేరిన వర్షం నీరు

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం రైల్వేగేటు వద్ద నిర్మించిన అండర్‌పాస్ ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఈ మార్గం మీదుగా నాలుగు మండలాల ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. దాదాపు రూ. 5.50 కోట్లకుపైగా వెచ్చించి రైల్వే గేటుతో సంబంధం లేకుండా రాకపోకలకు ఆలస్యం లేకుండా అండర్ పాస్ నిర్మించారు. అండర్‌పాస్ నిర్మించి దానిపైన ఎలాంటి పై కప్పు వేయలేదు. వర్షాకాలం ప్రారంభంకావడంతో బుధవారం కురిసిన వర్షానికి నీరు చేరి అండర్ పాసులో నీరు నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, చిన్నారులు, పాఠశాలకు వెళ్ళే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ఈ వర్షాకాలమంతా వర్షపు నీరు రెండువైపులా వచ్చి అండర్ పాస్‌లో నిలిచిపోతే పూర్తిగా రాకపోకలు జరగని ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు అండర్‌పాస్ పై భాగంలో వర్షపునీరు కిందకు పడకుండా రక్షణ చర్యలు వెంటనే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మేదర కుటుంబాలకు పక్కా ఇళ్లు ఇవ్వాలి

కొయ్యలగూడెం: మేదర కుటుంబాల వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించాలని శ్రీలక్ష్మి గణపతి మహేంద్ర మేదర సంఘం ప్రభుత్వాన్ని కోరింది. గవరవరం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల మేదరకుల సంఘ సభ్యులు ఈ మేరకు కోరారు. కొయ్యలగూడెం, తాడేపల్లిగూడెం జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా కులవృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే వందకు పైగా కుటుంబాల వారు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గత మూడు దశాబ్దాలుగా మేదర సంఘం ఎదుర్కొంటున్న అంశాలను సమావేశంలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని తీర్మానం చేశారు. అధ్యక్షుడిగా అంకోలు క్రాంతికుమార్, కార్యదర్శిగా జోరెగే మోహన్, కోశాధికారిగా చందా కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కాపెల్లి చిన్న బాలయ్య, సభ్యులుగా పిల్లి జార్జి, సిరిగిరి తాతరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల సేవా సమితి సేవలు అభినందనీయం



గుండుగొలనులో దివ్యాంగులకు ఆహార పొట్లాలను అందిస్తున్న హనుమంతు భవానీ

భీమడోలు: శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలనులోని దుప్పల శేషగిరిరావు జ్ఞాపకార్థం భార్య గుండుగొలను యూనియన్ బ్యాంకు మేనేజర్ హనుమంతు భవాని ఆర్థిక సాయంతో గురువారం దివ్యాంగుల సేవా సమితిలోని 60 మందికి భోజన పొట్లాలను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం, జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. వారిని అప్యాయంగా పలకరించి ఆదరించాలని భవాని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సమితి నిర్వాహకులు, వికలాంగులు పాల్గొన్నారు.

ధర్మరాజును కలిసిన పీఎంపీలు



ఎమ్మెల్యేగా ఎన్నికైన ధర్మరాజును కలిసిన పీఎంపీ అసోసియేషన్ నేతలు

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన పత్సమట్ల ధర్మరాజును పీఎంపీ అసోసియేషన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండలశాఖ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీల మస్తర్లు తనిఖీ చేస్తున్న ఏపీఓ దశరధ రామ్‌జీ

దెందులూరు: మండలంలో 4,77,677 పని దినాలతో ఉపాధి పనులు జరుగుతున్నాయని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. గురువారం మండలంలో కొవ్వలి, రామారావుగూడెం, చల్లచింతలపూడి గ్రామాల్లో ఉపాధి పనులు, కూలీలు, మస్తర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో పూడికతీత, పంటకాల్వల బాగుచేత వంటి పనులు చేస్తున్నారన్నారు. కూలీలకు సకాలంలో వేతనం చెల్లించామన్నారు.

ధర్మరాజుకు అభినందనలు



ధర్మరాజుకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ కార్యకర్తలు, అభిమానులు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన పత్సమట్ల ధర్మరాజును గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం నారాయణపురంలోని క్యాంపు కార్యాలయం వారందరూ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ధర్మరాజు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, కూటమి శ్రేణులు గమనించాలని ఆయన వ్యక్తిగత సహాయకుడు వాసు తెలిపారు.

చురుగ్గా సాల్వే ఆర్మీ చర్చి నిర్మాణం



దెందులూరు గౌడవీధిలో నిర్మిస్తున్న సాల్వే ఆర్మీ మిలీనియం చర్చి

దెందులూరు: దెందులూరు గౌడవీధిలోని సాల్వే ఆర్మీ మిలీనియం చర్చి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం కోర్ ఆఫీసర్, మేజర్ కె.రమణయ్య పనులను పరిశీలించారు. చర్చి నిర్మాణానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయగ్రహీత, దివంగత పల్లె యోహాన్ చంద్రహాస 2 సెంట్ల స్థలాన్ని దానం చేసి చర్చికి రిజిస్ట్రేషన్ చేశారు. సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

ప్రతిభకు ఉపకార వేతనం

- స్కాలర్‌షిప్ పరీక్షలో భీమడోలు మండల విద్యార్థుల సత్తా
- ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు 9 మంది విద్యార్థుల ఎంపిక



పూళ్లలో ఎన్‌ఎంఎంఎస్‌లో మెరిసిన చిన్నారులతో రిటైర్డ్ టీచర్ బి.పరశురాముడు

భీమడోలు: జాతీయ స్థాయి మీన్స్ కమ్ మెరిట్ ఉపకార వేతనాల ఎంపిక పరీక్షలో భీమడోలు మండల విద్యార్థులు తమ సత్తా చాటారు. గతేడాది డిసెంబర్ 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షలో మండలంలోని పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక, భీమడోలు ఉన్నత పాఠశాలలకు చెందిన 9 మంది జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. పూళ్ల నుంచి నలుగురు, గుండుగొలనులో 3, భీమడోలు, ఆగడాలలంక జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఒకొక్కరు చొప్పున ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగేళ్లకు రూ.48 వేలను విద్యార్థులకు అందజేస్తారని ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన రిటైర్డ్ టీచర్ బి.పరశురాముడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయన లెక్కల సబ్జెక్టులో మెలకువలను నేర్పించి విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీనితో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. వారిలో గణేశుల లక్ష్మీగణేష్ 2వ ర్యాంకు, కూటికుప్పల బాలచందర్ 4వ ర్యాంకు, గేదెల సౌజన్య 6వ ర్యాంకు, ఎస్సీ కేటగిరి బాలికల విభాగంలో కొరపాటి అనూష 2వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ విద్యార్థులంతా పూళ్ల శాఖా గ్రంథాలయం విద్యార్థులు కావడంతో వారిని గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, పెద్దలు అభినందించారు. రిటైర్డ్ టీచర్ బి.పరశురాముడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విశ్వకర్మ కార్పెంటర్స్ సేవా ట్రస్ట్ సమావేశం

కొయ్యలగూడెం: విశ్వకర్మ కార్పెంటర్స్ సేవా ట్రస్ట్ సేవా దృక్పథంతో ముందుకు సాగుతుందని రాష్ట్ర చైర్మన్ గుగ్గిలపు శ్రీనివాస్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో గురువారం విశ్వకర్మ కార్పెంటర్ సేవా ట్రస్ట్ సమావేశం అసోసియేషన్ నాయకులు జవ్వాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని విశ్వకర్మ కార్పెంటర్లు ట్రస్ట్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. తద్వారా సభ్యుడికి, అతని కుటుంబానికి ఆపత్కాల సమయంలో గంట వ్యవధిలోగా రూ.6 వేలు సేవా దృక్పథంతో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ట్రస్టులో అర్హులైన సభ్యులంతా సభ్యత్వం తీసుకునేలా సహచర కార్పెంటర్స్ సభ్యులు కృషి చేయాలని ట్రెజరర్ లక్కోజు వెంకట సుబ్రహ్మణ్యం కోరారు. కంచి కామాక్షి పీఠం ద్వారా కొయ్యలగూడెం మండలంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సభ్యులను అభినందించారు.

నీట్‌లో సిరిప్రియకు 705 మార్కులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైద్య విద్యాభ్యాసం చేయడానికి దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన నీట్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో నగరానికి చెందిన ఎర్రా సిరిప్రియ అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. మొత్తం 720 మార్కులకు 705 మార్కులు సాధించింది. జనరల్ కేటగిరీలో ఆమెకు 531 ర్యాంకు వచ్చిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె తల్లిదండ్రులు వైవీ శివరామకృష్ణ, లక్ష్మీ కామేశ్వరి ఇరువురూ నగరంలో వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. సిరిప్రియను నగరంలోని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు కృషి

బుట్టాయగూడెం: గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి మలేరియా అధికారి జె.సురేష్ తెలిపారు. గిరిజన ప్రాంతంలో మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టేందుకు సుమారు 30టన్నుల మలాథియాన్ బస్తాలు గురువారం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నుంచి బుట్టాయగూడెం వచ్చాయి. వాటిని బుట్టాయగూడెం మలేరియా సబ్‌యూనిట్ స్టోర్ రూమ్‌లో నిల్వ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మండలాల్లో సుమారు 136 మలేరియా సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని అన్నారు. ఆయా గ్రామాల్లో దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, మండలాల్లో మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ పనులకు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని అన్నారు. ఇళ్లల్లో కూడా మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు చేయడం వల్ల దోమలు నివారించవచ్చని అన్నారు. అలాగే వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ



భీమడోలులో ప్రైవేటు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవోలు



సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను తనిఖీ చేస్తున్న ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్

భీమడోలు: డీఈవో ఆదేశాల మేరకు మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలను విద్యాశాఖాధికారుల బృందం గురువారం పరిశీలించింది. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌తో పాటు పలు పాఠశాల హెచ్‌ఎంలు బృందంగా ఏర్పడి ప్రైవేటు పాఠశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల గుర్తింపు పత్రాలు, అదనపు తరగతులకు సంబంధించిన పత్రాలు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు, పాఠశాలలో వసతుల కల్పన, రికార్డులు, రిజిస్టర్లను వారు పరిశీలించారు. అనుమతి పొందిన ప్రదేశంలోనే పాఠశాలలను నిర్వహిస్తున్నదీ లేనిదీ వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భువనేశ్వరరావు, సత్యనారాయణ, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు మండలంలో...

దెందులూరు: దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ గురువారం ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. సెయింట్ మేరీస్ యూపీ పాఠశాల, అమ్మ పాఠశాల, ప్రజ్ఞ పాఠశాలను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, విద్యార్థుల సంఖ్య, ఫలితాలు, యూడైస్ వివరాలు, తాగునీరు, గ్రౌండ్, ల్యాబ్, అడ్మిషన్లు సౌకర్యాలు, టాయిలెట్స్‌ను నిశితంగా పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ టీనా మరియా, పాఠశాల సిబ్బంది నిర్వహణ తీరుపై ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. దెందులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయులు జ్యోతి, హెలెన్ రాణి తదితరులు ఉన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం



చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న జిల్లా డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు

భీమడోలు : సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు గ్రంథాలయాలు సోపానాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం వేసవి విజ్ఞాన తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో ఘనంగా సాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. నీతి కథలు చదివి వాటి సమీక్షలు రాశారు. జీకే అంశాలపై చిన్నారులు పట్టు సాధించేలా తర్ఫీదును అందించారు. ఈ సందర్భంగా తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో నైతిక విలువలు కొరవడుతున్నాయని, వాటిని విద్యార్థి దశ నుంచి పెంపొందించేందుకు గ్రంథాలయాలు చక్కని వేదిక అన్నారు. ప్రతి విద్యార్థి పెద్దలు, తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలను చూపాలన్నారు. ప్రతిరోజు పుస్తకాన్ని పఠించడం ద్వారా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చుతుందన్నారు. అనంతరం చిన్నారులకు తెలుగు, ఇంగ్లీషు భాషలపై డిక్టేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

భీమడోలు సొసైటీ త్రిసభ్య కమిటీ రాజీనామా

భీమడోలు: భీమడోలు రైతు సేవా సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ రావిపాటి సత్యశ్రీనివాస్, డైరెక్టర్లు ఎస్.జంగం, కిలపర్తి భాస్కరరావు గురువారం తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. వ్యక్తిగత కారణాల రీత్యా తమ పదవులకు రాజీనామ చేసినట్లు వారు తెలిపారు. రాజీనామా పత్రాలను సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించామన్నారు. ఇప్పటివరకు తమకు సహకరించిన రైతులు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేటకు చెందిన పాకలపాటి మధుసూదనరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ డీఈఓ బాబురావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు తదితరులున్నారు.

దోమల వ్యాప్తి నిర్మూలనకు కృషి చేయాలి



కేశవరంలో మలేరియాపై అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా మలేరియా తదితర వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా గురువారం కేశవరం గ్రామంలో ప్రజలకు మలేరియా వ్యాధి వ్యాప్తి, కారణాలు, లక్షణాలు, చికిత్స తదితర విషయాలపై అవగాహన కల్పించారు. జ్వరం రెండు మూడు రోజులు ఉంటే తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి గుర్తించి చికిత్స పొందాలన్నారు. ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలనుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గణపవరం-2 సచివాలయం పరిధిలో మలేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి మాట్లాడుతూ మలేరియా పరీక్షలు పీహెచ్‌సీలో ఉచితంగా చేస్తామని, వ్యాధినిర్ధారణ జరిగితే అవసరమైన చికిత్స అందిస్తామన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిత్య పారాయణ గ్రంథం భగవద్గీత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ నిత్యం పఠించాల్సిన గ్రంథం శ్రీ భగవద్గీతేనని ప్రవచనకర్త హరి శ్రీనివాసశాస్త్రి అన్నారు. వేసవి సెలవులు సందర్భంగా నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీనివాస్ శాస్త్రిచే నిర్వహించిన భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఏప్రిల్ 28వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 40 రోజుల పాటు ఈ తరగతులు కొనసాగాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాల బహూకరణ కార్యక్రమం నిర్వహించారు. హరి శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అహంకారాన్ని విడి సంస్కారాన్ని నేర్చుకోవాలని భగవద్గీత నేర్పుతుందని చెప్పారు. పాశ్చాత్య పోకడలు పోతున్న నేటి సమాజంలో చిన్నారులను ఆధ్యాత్మిక బాట పట్టించేందుకు ఇటువంటి కార్యక్రమం చేపట్టిన యర్రా శివరామకృష్ణ, యర్రా లక్ష్మీ కామేశ్వరి దంపతుల జన్మ ధన్యమైందన్నారు. తొలుత హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ 40 రోజుల శిక్షణలో చిన్నారులు భగవద్గీత పఠనం ద్వారా గీతా సారాంశంలోని జీవన విధానం, ఓర్పు, నేర్పు, సమతుల్యత, ఎన్నో విలువైన అంశాలు నేర్చుకున్నారని, అవి వారి జీవన విధానంలో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్య కాంతారావు మాట్లాడుతూ మనిషి జీవన విధానానికి భగవద్గీత చదవడం ఎంతో ఉపయోగకరమని, అందరూ పఠించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ పక్షాన చిన్నారులకు భవద్గీతను బోధించిన శ్రీహరి శ్రీనివాస శాస్త్రిని దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. హిందూ యుజవన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, సభ్యులు ఎంవీ రవీంద్ర, ఎం సూర్యనారాయణ యాదవ్, కేసా సాంబశివరావు, నుదురుపాటి కృష్ణ చైతన్య శర్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వానాకాలం.. పశువులు జాగ్రత్త!

- సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకే ముప్పు





బుట్టాయగూడెం: వానాకాలం రావడంతో పశువులు, గొర్రెలు ఇతరత్రా జీవాలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. జీవాలకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే సకాలంలో అందుబాటులో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స చేయించాలని సూచిస్తున్నారు. అలాగే ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

బ్లూటంగ్– ఫూట్‌రాట్ లక్షణాలు

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధులు సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు దద్దరించడం, నోటిలోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్ల కుంటడం, ఒంట్లో నీరు చేరడం , పారుకోవడం, మేత మెయ్యకపోవడం, అలాగే ఈసుకుపోవడం (అబార్షన్‌లు) 30 శాతం వరకూ మరణాలు వంటి లక్షణాలు ఉంటాయి. వీటి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడూ బ్లూటాక్స్/టిక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పొడు ప్రాంతాల్లో మేతకు వెళ్లాలి.

కాళ్లపుండ్లు వ్యాధి సోకితే..

జీవాలకు కాళ్లపుండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య సీము చేరి చెడువాసన వస్తుంది. అలాగే గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

గొంతువాపు వ్యాధి : పశువులకు సోకే వ్యాధులకు గొంతువాపు వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వల్ల సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీరు ద్వారా, మేత ద్వారా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధులు బారిన పడతాయి. గొంతువాపు వ్యాధి బారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకేపాకలో మిగతావాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే వర్షాకాలంలో పశువులు వర్షాలకు తడవకుండా చూడాలి.

నివారణ చర్యలు : జూన్, జులై, ఆగస్టు నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధిసోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చెయ్యాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

చిటిక వ్యాధి : ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయస్సు గల గొర్రెల్లో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రె తక్కువ సమయానికే మరణిస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నీరసిస్తాయి. కొద్దిసేపటికే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్న వేళల్లో గొర్రెల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను గొర్రెల మంద నుంచి వేరు చేయాలి.

పశువులకు వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందుగానే టీకాలు వేయించడం ఉత్తమం. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే పశుప్రాణాలకు ముప్పు. పశువులకు సోకే వ్యాధులను గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వైద్యం అందేలా కృషి చేయాలి.

– డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు, సహాయ సంచాలకులు
ప్రాంతీయ పశువర్ధకశాఖ, జీలుగుమిల్లి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు

90102 23729

99122 20559

Office mail : tpgadvt@gmail.com